17, 18వ తేదీలలో గ్రూప్-3 పరీక్షలు

మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 7: గ్రూప్-3 పరీక్షలను ఈ నెల 17, 18వ తేదీలలో నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 115 పరీక్షా కేంద్రాలలో 65,361 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని, ఈ పరీక్షలు రెండు సెషన్లలో ఉంటాయని 17న పేపర్-1 ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, పేపర్-2 మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు, 18న పేపర్-3 ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ నుంచి కమిషన్ వెబ్‌సైట్ HTTPS://WWW.TSPSC.GOV.IN నుంచి హాల్ టిక్కెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఏదైనా సాంకేతిక సమస్యలు ఉంటే అభ్యర్థులు TGPSC టెక్నికల్ హెల్ప్ డెస్క్‌ని ఫోన్ నం: 040-2354 2185 లేదా 040-2354 2187 సంప్రదించాలని, లేదా HELPDESK@TSPSC.GOV.IN కు ఇమెయిల్ చేయవచ్చని సూచించారు.

నేటితో స్టిక్కర్ల పంపిణీ పూర్తి!

తొమ్మిదో తేదీ నుంచి ఇంటింటి సమగ్ర సర్వే



సిటీబ్యూరో, నవంబరు 7(నమస్తే తెలంగాణ): ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే జీహెచ్ఎంసీలో ముమ్మరంగా కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ఈ నెల 6వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలోనే జీహెచ్ఎంసీలో మొదటి దశలో ఎన్యూమరేటర్ బ్లాక్‌లో ప్రతి ఇంటిలో కుటుంబ వివరాలను నమోదు చేస్తూ వాటికి సంబంధించిన ఇంటి నంబర్, యాజమాని పేరుతో కూడిన ఇండ్ల జాబితా 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు తయారు చేయడంతో పాటు స్టిక్కర్ ఇంటి గోడలపై అతికించే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. మూడు రోజుల పాటు 13,35,673 ఇండ్లను లిస్ట్ పూర్తి చేసి ప్రతి ఇంటికి స్టిక్కర్ వేస్తారని, నేటి శుక్రవారంలోగా ఈ ప్రక్రియ ముగుస్తుందని అధికారులు తెలిపారు. రెండో దశలో ఈ నెల 9 తేదీ నుంచి సర్వేను చేపడతామని అధికారులు వివరించారు.

విపత్తు నిర్వహణపై హైడ్రా పర్యటన

- డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై బెంగళూరు ఏజెన్సీతో సమావేశం
- రానున్న ఆపదలను తట్టుకునేలా పలువురు నిష్ణాతులతో భేటీ
- చెరువుల పునరుద్ధరణపై క్షేత్రస్థాయి పరిశీలన

బెంగళూరు డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన పరికరాలను పరిశీలిస్తున్న హైడ్రా

సిటీబ్యూరో, నవంబర్ 7(నమస్తే తెలంగాణ): చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై అధ్యయనానికి హైడ్రా బృందం బెంగళూరులో పర్యటిస్తోంది. రెండు రోజుల పర్యటనలో భాగంగా యలహంకలోని కర్ణాటక స్టేట్ నేచురల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ సెంటర్‌ను హైడ్రా కమిషనర్ రంగనాథ్, బృందం సభ్యులు అక్కడి అధికారులతో కలిసి గురువారం సందర్శించారు. మానిటరింగ్ సెంటర్‌లో ఉన్న సీనియర్ శాస్త్రవేత్తలతో సమావేశమై బెంగళూరులో డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై చర్చించారు. ఆ తర్వాత సెన్సార్ సాయంతో ముందస్తుగా వర్ష సమాచారం ప్రజలకు చేర్చడం, ఎంత మొత్తం వర్షం పడబోతోంది? వరద ముంచెత్తే ప్రాంతాల వారిని అలర్ట్ చేయడం, ట్రాఫిక్ జామ్ అలర్ట్, ప్రత్యామ్నాయ రహదారులను సూచించే విధానాలపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. బెంగళూరు మేఘ సందేశం యాప్ పనిచేసే విధానం, ఈ యాప్ ద్వారా ఏయే ప్రాంతాల్లో ఎంత మోస్తరు వర్షం కురుస్తుంది? ట్రాఫిక్ జామ్, వడగండ్ల వానతో పాటు ఇతర వాతావరణ అంశాలతో అలర్ట్ చేసే ప్రక్రియను పరిశీలించారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాలను అప్రమత్తం చేయడం, వరద కాలువలు ఎంత మొత్తంలో నిండాయి? ఈ నీరు ఎలా వెళ్తుంది? ఎక్కడ చెత్త పేరుకుపోయింది? ఇలాంటి అంశాలపై అలర్ట్ చేసే ప్రధానమైన సెన్సర్ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. 20 ఏండ్ల డేటాతో ఎన్ని సెంటిమీటర్ల వర్షం పడితే.. ఎక్కడ వరద వస్తుందో? అంచనా వేయడం, కేఎస్ఎన్‌డీఎంసీ కేంద్రంలో వర్షపాతం నమోదు, గాలి వేగం, ఉష్ణోగ్రతల వివరాలు చెప్పే కేంద్ర పని తీరును కమిషనర్ రంగనాథ్ బృందం చూశారు. ఆ తర్వాత యలహంక, జక్కూర్ చెరువులను పునరుద్ధరించిన తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి గతంలో ఎలా ఎండేది? ఇప్పుడెలా డెవలప్ చేశారు? అన్న అంశాలపై అధికారులతో మాట్లాడారు. చెరువుల్లోకి వస్తున్న మురుగును తొలగించి ఎస్టీపీల ద్వారా మురుగునీటిని శుద్ధి చేసి చెరువులను నింపుతున్న విధానాన్ని, చెరువుల పునరుద్ధరణకు అనుసరిస్తున్న విధానాలను బృహత్ బెంగళూరు మహానగర పాలిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. సుందరీకరణతో పాటు చెరువులోకి మురుగు చేరకుండా పైభాగంలో కుంటలు ఏర్పాటు చేసి సిల్ట్ నుంచి నీటిని వేరుచేసే విధానంపై బెంగళూరు అధికారులు హైడ్రా బృందానికి వివరించారు. చెరువుల పునరుద్ధరణకు ఏమోస్ టెక్నోక్రాట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులతో సమావేశమై వివరాలు తెలుసుకున్నారు.

నేడు ఆనంద్‌తో సమావేశం

రెండోరోజు పర్యటనలో భాగంగా శుక్రవారం హైడ్రా బృందం బెంగళూరులో లేక్ మ్యాన్ ఆనంద్ మల్లిగవాడ్‌తో సమావేశమవుతారు. కర్ణాటక ట్యాంక్ కన్జర్వేషన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం 2014పై చర్చించనున్నారు. బెంగళూరు కోర్ సిటీలో ఉన్న చెరువులను పరిశీలిస్తారు. అనంతరం, ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలోని మార్గందోనహల్లిచెరువు, ఇన్ఫోసిస్ అభివృద్ధి చేసిన చెరువులను సందర్శిస్తారు. హైదరాబాద్‌లోని అప్ప చెరువు, సున్నం చెరువు, నల్ల చెరువు, ఎర్రగుంట చెరువులను పునరుద్ధరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో తమ బృందంతో రెండు రోజుల పర్యటనకు బెంగళూరు వచ్చామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెప్పారు. బెంగళూరులో క్షేత్రస్థాయి పర్యటన తర్వాత హైదరాబాద్‌లో చెరువులను పునరుద్ధరిస్తామని, చెరువులను సుందరీకరించేందుకు బెంగళూరులో చేపట్టిన విధానాలపై ప్రభుత్వానికి తెలియజేస్తామని రంగనాథ్ తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్న ఈ పర్యటనలో కమిషనర్ రంగనాథ్ వెంట హైడ్రా బృంద సభ్యులు రీజనల్ ఫైర్ ఆఫీసర్లు వి.పాపయ్య, ఏ.జయప్రకాశ్, ఏఈ నాగరాజు, ఇన్‌స్పెక్టర్ విజయ్ ఆదిత్య ఉన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్

కులగణనకు ప్రజలు సహకరించాలి

చౌటుప్పల్ రూరల్, నవంబర్ 7 : కుల గణనకు ప్రజలు, రాజకీయ పార్టీలు సహరించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన కుల గణనను స్వాగతిస్తున్నామన్నారు. కులాల వారీగా సమాచారం లేకపోతే బీసీలకు న్యాయబద్ధంగా విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో దక్కాల్సిన కోటా దక్కదని పేర్కొన్నారు. కులగణన ఎందుకని బీజేపీ నాయకులు ప్రశ్నించడం సిగ్గుచేటని, కులగణనపై పార్టీల వైఖరి తెలుపాలని సూచించారు. సమావేశంలో నాయకులు బొంగు జంగయ్యగౌడ్, వీరమళ్ల కార్తీక్, సిలివేరు శ్రీనివాస్, వెంకటేశం, సతీశ్, నరేశ్, భరత్‌సాయి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 7 : మండలంలోని అనాజిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎం.వర్షిత రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాల్వాయి నాగవర్ధన్‌రెడ్డి తెలిపారు. 3, 4, 5 తేదీల్లో కామారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 ఖోఖో పోటీల్లో వర్షిత మంచి ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు చెప్పారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థినిని పలువురు అభినందించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ రాయపురం ప్రీతి, మాజీ సర్పంచ్ ఏదునూరి ప్రేమలత, మాజీ ఎంపీటీసీ గునుగుంట్ల కల్పన, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆమెను అభినందించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు సాయిశంకర్

మోత్కూరు, నవంబర్ 7 : మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి గంగుల సాయిశంకర్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. శంకర్‌ను గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రభాజస్టీస్ అభినందించారు.

ఆర్థిక సాయం

రామన్నపేట, నవంబర్ 7 : మొదటి ప్రయత్నంలోనే ఎంబీబీఎస్ సీటు సాధించిన మండలంలోని శోభనాద్రిపురం గ్రామానికి చెందిన పేదింటి బిడ్డ సానియా చదువుకు దాతలు సహకరించాలని నమస్తే తెలంగాణలో ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. హంస ఫౌండేషన్ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు చెరుకు లక్ష్మి రూ.10వేల ఆర్థిక సాయం ప్రకటించారు. ఆ నగదును బీఆర్ఎస్ నాయకులు గురువారం అందజేశారు. కార్యక్రమంలో కూనూరు శ్రీనివాస్‌గౌడ్, ఎండీ లతీఫ్, ఎండీ ఏజాస్, బొడ్డుపల్లి రాజు, కందుల నర్సింహ, ఎండీ జానీపాషా, మల్లం సైదులు, మాండ్ర రామచంద్రం, కూనూరు అంజన్‌కుమార్, కృష్ణ, శేఖర్, మల్లయ్య ఉన్నారు.

అక్రమ నిర్మాణంపై ఎంపీఓ విచారణ

యాదగిరిగుట్ట (మోటకొండూర్), నవంబర్ 7 : అక్రమ నిర్మాణంపై వచ్చిన ఫిర్యాదుపై ఎంపీఓ చంద్రశేఖర్ విచారణ చేపట్టారు. మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో ఏకే ఫంక్షన్‌హాల్ ముందు ప్రహరీ నిర్మాణంపై గ్రామ యువకులు కలెక్టర్ ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం మండల పంచాయతీ అధికారి విచారణ చేపట్టి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అక్రమ నిర్మాణమని తేల్చి కూల్చివేయాలని స్థానిక పంచాయతీ కార్యదర్శికి మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు.

యాదవ మహాసభ యూత్ జిల్లా ఉపాధ్యక్షుడిగా శివాజీ

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 7 : అఖిల భారత యాదవ మహాసభ యూత్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఇంద్రియాల గ్రామానికి చెందిన శెట్టి శివాజీయాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు సుక్కల సత్యంయాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుండెబోయిన అయోధ్యయాదవ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పరిశ్రమలకు అగ్ని ప్రమాదాల ముప్పు

ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్

మాదాపూర్, నవంబర్ 7: పరిశ్రమలకు అనేక రకాలైన ప్రమాదాలతో ముప్పు పొంచి ఉందని, చాలా ఫార్మా కంపెనీలు ఈఎస్‌జీ మార్గదర్శకాలను పాటించని కారణంగా యురోపియన్ రెగ్యులేటర్ల వాచ్‌లిస్ట్‌లో ఉన్నాయని, వాటిని పాటించకుంటే భారత్ నుంచి ఫార్మాస్యూటికల్ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం మానేస్తారని ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో గురువారం ఫార్మా ఇండస్ట్రీ కొరకు ఫైర్, ఎలక్ట్రికల్, సెక్యూరిటీ అండ్ ఆటోమేషన్ (ఫెసా)పై ఫెసా 2024 పేరుతో రెండు రోజుల జాతీయ సెమినార్‌ను నిర్వహించారు. ఇందుకు ముఖ్య అతిథిగా ఐటీ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ విచ్చేసి ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్, ఐపీఎస్ వై.నాగిరెడ్డితో కలిసి కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫార్మా కంపెనీలు అనేక అవరోధాలను ఎదుర్కోవలసి వస్తుందని, ఎఫ్ఎస్ఎఐ వంటి సంస్థలు సమర్థవంతమైన అగ్ని భద్రత కొరకు ఫార్మా పరిశ్రమ యొక్క సమస్యలను పరిష్కరించగలవని చెప్పారు.

జన గణనలో కుల గణన చేపట్టాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, ఏపీ మహిళా అధ్యక్షురాలు నూకలమ్మ

రవీంద్రభారతి, నవంబర్ 7: కేంద్ర ప్రభుత్వం జన గణనలో కుల గణన చేపట్టి పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ పెట్టి బడ్జెట్‌లో 2 లక్షల కోట్ల నిధులు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కోర్ కమిటీ సమావేశాన్ని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ, రాజ్యాధికారంలో వాటా పంచకుండా బీసీలకు ఎన్ని రోజులు అన్యాయం చేస్తారని ప్రశ్నించారు. అన్ని రంగాలలో అభివృద్ధి చెందిన అగ్ర కులాలకు ఒకే రోజులో ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల బిల్లు పెట్టి ఆగమేఘాల మీద 10 శాతం రిజర్వేషన్లు పెట్టారని అన్నారు. కానీ, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు పెట్టాలని 30 ఏండ్లుగా పోరాడుతున్నా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆయన విమర్శించారు. దేశంలో బీసీలను బిచ్చగాళ్ళను చేశారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, ఏపీ సంఘం మహిళా అధ్యక్షురాలు నూకలమ్మ పాల్గొన్నారు.

90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో 50 వేల మ్యాన్ హోల్స్ శుభ్రం

జల మండలి ఎండీ అశోక్ రెడ్డి

సిటీబ్యూరో, నవంబరు 7(నమస్తే తెలంగాణ): సీవరేజి ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ హైదరాబాద్ లక్ష్యంగా జల మండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో ఇప్పటి వరకు 50 వేల మ్యాన్‌హోల్స్ శుభ్రం చేసినట్లు అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6,140 ప్రాంతాల్లో 700 కిలోమీటర్ల మేర సీవరేజ్ పైపులైన్‌ను డీ సిల్టింగ్ పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఘనతను సాధించినందుకు గానూ అధికారులు, సిబ్బందిని ఎండీ అశోక్ రెడ్డి అభినందించారు. అందరు నిబద్ధతతో పనిచేస్తున్నారని ఈ సందర్భంగా ప్రశంసించారు. రాబోయే రోజుల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని చెప్పారు. ఈ స్పెషల్‌లో దీర్ఘకాలికంగా ఉన్న సీవరేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారంతో పాటు భవిష్యత్తులో నీటి కరువు రాకుండా ఇంకుడు గుంతలు నిర్మించేలా చర్యలు తీసుకుంటామని ఎండీ పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు పరిశీలన

ఆత్మకూరు(ఎం), నవంబర్ 7 : మండలంలోని రాఘవాపురం, కూరెళ్ల గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాల అమలుపై గురువారం నేషనల్ లెవల్ మానిటరింగ్ టీం పరిశీలించింది. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలను పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు అర్జున్ ఎస్,సుహాబ్ ఎస్, ఎంపీడీఓ రాములునాయక్, సూపరిండెంట్ లోకేశ్వర్‌రెడ్డి, ఏపీఓ రమేశ్, ఏపీఎం కిరణ్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : రాఘవాపురంలో ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న నేషనల్ లెవల్ మానిటరింగ్ టీం సభ్యులు

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి : బీఆర్ఎస్

మోత్కూరు, నవంబర్ 7 : ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో గురువారం బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ధాన్యం రాశులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతును ఏడిపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పతనంకాక తప్పదన్నారు. మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సామేల్ 20 రోజుల క్రితం ప్రారంభించినప్పటికీ ఇప్పటి వరకూ కాంటాలు వేయలేదని తెలిపారు. ప్రభుత్వం కొనుగోళ్లు చేయకపోవడం వల్ల రైతులు దళారుల చేతుల్లో మోసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి కాంట్రాక్టులు, కమీషన్లు తప్ప ప్రజలు, రైతుల సంక్షేమం మీద సోయిలేదని మండిపడ్డారు. ఇది హామీలను అమలు చేయని అసమర్థ ప్రభుత్వమన్నారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని, రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు మర్రి అనిల్‌కుమార్, నాయకులు కొండ సోమల్లు, బయ్యని పిచ్చయ్య, విద్యాసాగర్, పొన్నెబోయిన మత్స్యగిరి, దండ్ల కిష్టయ్య, బద్దం సంజీవరెడ్డి, అమరేందర్ పాల్గొన్నారు.

మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన

అవగాహన సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు

బీబీనగర్, నవంబర్ 7 : జాతీయ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక మహిళా డిగ్రీ కళాశాలలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ చిన్నబాబు సంకవల్లి, డాక్టర్ డానియెల్ ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులకు క్యాన్సర్ రావడానికి కారణాలు, లక్షణాలు, నివారణ, చికిత్స గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.నిరుప మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన అవసరమని, క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం ద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని అన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు, ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. తెలంగాణ గురుకులాల సెక్రెటరీ వర్షిణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి : మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, నవంబర్ 7 : పట్టణాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. పట్టణంలోని 19వ వార్డులో గురువారం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు వార్డుల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెంలో నిర్మిస్తున్న మల్లికార్జున స్వామి ఆలయం భూమి పూజలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్లు బండమీది మల్లేశ్, బత్తుల రాజ్యలక్ష్మి, నాయకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న రాజు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

ఓటరు నమోదును సక్రమంగా నిర్వహించాలి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, నవంబర్ 7: ఓటరు నమోదును సక్రమంగా నిర్వహించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల ప్రణాళిక సమావేశంలో ఎమ్మెల్యే గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ఒకే కుటుంబంలోని భార్యాభర్తలకు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఉండటంతో ఇబ్బందులు వస్తున్నాయని, కుటుంబాన్ని ఒకే పోలింగ్ బూత్‌ను కేటాయించాలన్నారు. ఓటరు నమోదులో ఆశావర్కర్ల సేవలు వినియోగించుకుని వారికి పారితోషకం ఇవ్వాలన్నారు. గతంలో పాల్గొన్న వారికి పారితోషకం అందకపోవడంతో వారు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. జియో ట్యాగింగ్ సక్రమంగా నిర్వహించాలన్నారు. అర్హులైన వారి పేర్లు నమోదు చేయాలని, ఓటు హక్కును అందరు ఓటు వేసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరి, ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ అహ్మద్ నదీం, కలెక్టర్ గౌతం పాత్రో తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో 16% అధిక విద్యుత్తు డిమాండ్

- పంపిణీ, సరఫరా వ్యవస్థను మెరుగుపరచాలి
- సంక్రాంతిలోగా నిర్వహణ పనులు పూర్తిచే యాలి
- ఎస్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ ముషారఫ్ ఫరూఖీ

హైదరాబాద్/సిటీబ్యూరో, నవంబర్ 7(నమస్తే తెలంగాణ): వచ్చే వేసవిలో రాష్ట్ర వ్యాప్తంగా 20 నుంచి 25 శాతం వరకు విద్యుత్తు డిమాండ్ పెరిగే అవకాశమున్నదని ఎస్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. గ్రేటర్ పరిధిలో నిరుడు 3,756 మెగావాట్లు ఉన్న గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ ఈ ఏడాది 16 శాతం వృద్ధితో 4,352 మెగావాట్లుగా నమోదైందని వెల్లడించారు. హైదరాబాద్ మింట్ కాంపౌండ్‌లోని సంస్థ కార్యాలయంలో ఆయన అధికారులతో గురువారం సమీక్షించారు. జీహెచ్ఎంసీ శివారులోని నెమలినగర్, గోపన్‌పల్లి, కోకాపేట, కోహెడ, తట్టి అన్నారం, అబ్దుల్లాపూర్‌మెట్, మన్సాన్‌పల్లి, అజీజ్‌నగర్, కందుకూరు, కే సింగారం, మల్లాపూర్, వాయుపురి, ఉప్పల్ భగాయత్, దుండిగల్ ఏరియాల్లో డిమాండ్ అధికంగా నమోదయ్యే అవకాశం ఉన్నదని తెలిపారు. ఆయా చోట్ల అవసరాలకు తగినట్టు 220/132/33 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటు, సరఫరా, పంపిణీ వ్యవస్థలను పటిష్టం చేయాలని సూచించారు. నిర్వహణ, మరమ్మతు పనుల్లో వేగం పెంచి సంక్రాంతిలోగా పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ట్రాన్స్‌కో డైరెక్టర్ జగత్‌రెడ్డి, టీఎస్ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ నర్సింహులు, చీఫ్ ఇంజినీర్లు శ్రీరాంజి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

సంగీత దర్శకుడు చక్రవర్తి స్థలం వెనక్కు..!

- అక్రమార్కులు నిర్మాణాలు చేపట్టి అద్దెలకు ఇచ్చిన కథనం
- ఆక్రమణలు తొలగించి స్థలంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు

బంజారాహిల్స్, నవంబర్ 7: షేక్‌పేట మండల పరిధిలోని బంజారాహిల్స్‌లో సంగీత దర్శకుడు చక్రవర్తికి కేటాయించిన ఖరీదైన ప్రభుత్వ స్థలంలో వెలసిన ఆక్రమణలను తొలగించిన మండల రెవెన్యూ సిబ్బంది ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళ్తే.., షేక్‌పేట మండలం సర్వే నం.403లోకి వచ్చే బంజారాహిల్స్ రోడ్ నం.14లో సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం 1984లో అప్పటి ప్రభుత్వం 20 గుంటల స్థలాన్ని సినీ సంగీత దర్శకుడు చక్రవర్తికి కేటాయించారు. ఈ స్థలంలో రికార్డింగ్ థియేటర్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అయితే, ఏండ్లు గడిచినా రికార్డింగ్ థియేటర్ నిర్మించకపోవడంతో ఏడాది తర్వాత స్థలం కేటాయింపు రద్దయింది. కాగా, 2006లో ఈ స్థలాన్ని వెనక్కి తీసుకోవాలంటూ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా, సంగీత దర్శకుడు చక్రవర్తి కుటు